# ఆర్థిక పురోభివృద్ధిలో యువతే కీలకం

**తెలంగాణ రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్**




**ప్రజాపక్షం/గజ్వేల్ (మెదక్) :** 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థూల జాతీయోత్పత్తిగా ఎదిగేందుకు భారత్ కు పుష్కల అవకాశాలు ఉన్నాయని, ఇది వికసిత్ భారత్ ద్వారా సాధ్యం అవుతుందని, అందులో యువత ప్రము ఖ పాత్ర పోషించాలని తెలంగాణ, రాష్ట్ర గవర్నర్ సిపి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు శివారులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవాన్ని మంగళ వారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. దేశ స్థూల జాతీయోత్పత్తికి 18 శాతానికి పైగా వ్యవసాయమే ఆధారమైన నేపథ్యంలో మరింత వృద్ధిరేటుకై ప్రభుత్వం సహజ, సేంద్రియ సాగుకు మరింత మద్దతునిస్తుందని తెలిపారు. వ్యవసాయంతోపాటు ఉద్యాన, అటవీ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందని, దేశంలో 70శాతానికి పైగా గ్రామీణులకుప్రధానఆదాయవనరు వ్యవసాయమే అని, 82 శాతం పైగా చిన్న సన్నకారు రైతులే అని స్పష్టం చేశారు. విద్యార్థులు విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని, కష్టాలు ఎదురైతే విరామం ఇవ్వచ్చు కానీ వెనుక్కి తిరిగొద్దని పిలుపు నిచ్చారు. చదువుతో పాటు ప్రతి అంశంలో నాణ్యత చూపించినట్ట యితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని, అందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయన్నారు. తరుగుతున్న సాగు నేల, సహజ వనరులు, పంటల ఉత్పాదకత, పర్యావరణ మార్పుల నేపథ్యంలో సుస్థిర ఆహార, పోషక భద్రత సాధించడంతో పాటు సూపర్ ఎకానమిక్ పవర్ గా భారత్ ఎదిగేందుకు టెక్నాలజీ ఆధారిత వ్యవసాయంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ గీతాలక్ష్మి స్పష్టం చేశారు. ఆధునిక వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులకు పరిచయం చేయాలని, దాని ద్వారా పంటల ఉత్పాదకత పెరుగు తుందన్నారు.ఉపాధికోసం ఎదురుచూసే వ్యక్తిగా కంటే ఉపాధి కల్పించే శక్తిగా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. కాగా శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ నీరజ ప్రభాకర్ స్వాగత ఉపన్యాసం చేసి అభివృద్ధి నివేదికను గవర్నర్‌కు అందజేశారు. మేలైన ఉద్యాన మానవ వనరులుగా తీర్చి దిద్దేందుకు అవసరమైన శిక్షణ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందిస్తుందన్నారు. రైతులకు సాంకేతిక సలహాలిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ విద్యార్థులకు బంగారు పతకాలు, విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రధానం చేశారు. కలెక్టర్ మను చౌదరి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, డీన్ డాక్టర్ రాజశేఖర్, పరిశోధన సంచాలకులు డాక్టర్ కిరణ్, డిఎస్ఏ డాక్టర్ విజయ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ శ్రీనివాసన్, ఉద్యాన శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి, బోర్డు మెంబర్ డాక్టర్ మాథూర్ పాల్గొన్నారు.

## గంజాయి జోలికెళ్లొద్దు



**ప్రజాపక్ష/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** సిరిసిల్లలోని రగుడు వద్ద గలా డంప్ యాడ్ నందు జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన 41 కేసులలో స్వాదీనపరచుకున్న 36 కిలోల 436 గ్రాముల నిషేధిత గంజాయిని జిల్లా ఎస్పి ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్దతిలో తగులబెట్టడం జరిగింది.ఈ నేపథ్యంలో ఎస్పి మాట్లాడారు. ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య గంజాయి. ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి తమ అమూల్యమైన భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థవంతంగా నిరోధిస్తున్నారని అన్నారు. జిల్లాలోని పోలీసుల స్వాధీనంలో ఉన్న మిగతా గంజాయిని కూడా విడతల వారీగా చట్ట ప్రకారం తగులబెట్టుట జరుగుతుందని తెలియజేసారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై పీడీ యాక్టులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్ పి చంద్రయ్య, డీఎస్పి చంద్రశేఖర్ రెడ్డి, ఆర్ఐ యాదగిరి, టౌన్ సిఐ రఘుపతి, సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేశ్వరంలో ఎఇఒల నిరసన



**ప్రజాపక్షం/లోకేశ్వరం:** మండలంలోని వ్యవసాయ అధికారులు ఏఈఓలను మహబూబాబాద్ లో ఏఈఓ లను అకారణంగా సస్పెండ్ చేసిన కారణంగా మంగళవారం రోజున ముధోల్ డివిజన్ ఏఈఓలు లోకేశ్వరం లోని రైతు వేదికలో నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన వ్యక్తం చేశారు.టి ఏఈఓ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ సస్పెన్షన్ పై సమగ్ర విచారణ జరిపించాలని అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఈఓ లపై ఉన్న సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## బస్సు సౌకర్యం కోసం వినతి



**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్:** లోక్‌సభఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు మాకు బస్ సౌకర్యం కల్పించమని కోరారు.ఇప్పుడు ఎన్నికల కోడ్ ఉన్నది కోడ్ ముగిసిన తరువాత తప్పకుండా అధికారులతో మాట్లాడి గ్రామాలకు బస్ వచ్చేలా కృషి చేస్తాం అని చెప్పిన విధంగానే ఈ రోజు నిర్మల్ బస్ డిపో మేనేజర ప్రతిమ రెడ్డి,నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అల్లూరి మల్లా రెడ్డి,నిర్మల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎంబరి గంగాధర్ లు ఆర్టీసీ డీఎం ను మంగళవారం కలసి అక్కాపూర్, ముతాపూర్, న్యూవెల్మల్, బొప్పారం, కూచన్ పెల్లి మీదుగా సోన్ మండల కేంద్రం వరకు అలాగే న్యూపోచంపాడ్,భాగ్యనగర్,కిషన్‌రావు పేట్,మేడిపెల్లి,మామడ మండలంలోని బురుగుపెల్లి తాండామీదుగా బురుగుపల్లికి బస్ సౌకర్యం కల్పించాలని కోరారు.బస్ డిపో అధికారులు త్వరలోనే ఆయా గ్రామాలకు బస్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ప్రజాపక్షం/ముధోల్:** ప్రజలకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెలే పవార్ రామారావు పటేల్ అన్నారు. నేడు(బుధవారం) నియోజకవర్గం లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉండనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.గ్రామీణ నీటి పారుదల శాఖ,పంచాయతీ రాజ్ అధికారులు సైతం అందుబాటులో ఉండనున్నార న్నారు.ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు ఉండనున్నట్లు తెలిపారు.ప్రజలు వారి స్థానిక సమస్యలు దృష్టికి తీసుకువస్తే త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.ప్రజల సమస్యల కొరకు కేటాయిస్తున్న ఇట్టి సమయాన్ని సదివినియోగం చేసుకొవాలని సూచించారు.

## ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** సుల్తానాబాద్ మండలం దేవునిపల్లి గ్రామంలో ఒక ఇంట్లో నిల్వ ఉంచిన అక్రమ రేషన్ బియ్యాన్ని అధికారులు, పోలీసులు మంగళవారం పట్టుకున్నారు.. దాదాపు 200 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీన పరుచుకున్నట్లు అధికారులు తెలిపారు.అక్రమ బియ్యంను నిల్వ చేసిన నంబయ్య అనే వ్యక్తి పై కేసు నమోదు చేశామని తెలిపారు.

## బదిలీల్లో పారదర్శకత పాటించండి

**ప్రజాపక్షం/గంగాధర:** ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పిఆర్‌టియు తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కేతిరి తిరుపతిరెడ్డిలు కరీంనగర్ జిల్లా విద్యాధికారి సిహెచ్. వివిఎస్ జనార్దన్‌రావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌కు సంబంధించి వచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారిని కోరినట్లు వారు తెలిపారు.



## సహజ ఎరువులకే ప్రాధాన్యం



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతులందరూ సంప్రదాయ పంటలు సాగు చేయాలనీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అన్నారు.మంగళవారం హైదరాబాద్ నుండి రైతు వేదికల ద్వారా వీడియో కన్ఫరెన్స్‌లో సూచించారు. జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ రైతుల నుద్దేశించి మాట్లాడారు.రసాయన ఎరువులు వాడకం క్రమంగా తగ్గించి, రైతులు సహజ ఎరువుల వైపునకు మల్లాలని సూచించారు.వ్యవసాయ అధికారులు సాంప్రదాయ పంటల సాగు,దిగుబడులపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి మంగళవారం రైతువేదికలలో పత్తి, సోయా, మొక్క జొన్న ఇతర పప్పు దినుసుల పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.మహిళా రైతులు పాల్గొనేలా ప్రోత్సాహించాలని సూచించారు. రైతులు గోవింద్ రెడ్డి, భీంరావు,నారాయణరెడ్డి సాంప్రదాయ పంటలు సాగుపై వారి అభిప్రాయాలు తెలియజేసారు.అనంతరం గ్రామ పల్లె ప్రకృతి వనం, నర్సరీని కలెక్టర్ సందర్శించి పెంచు తున్న మొక్కల రకాలు, సంఖ్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం మిషన్ భగీరథ సర్వేను కలెక్టర్ పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ప్రతి ఇంటి సర్వేను పకడ్బందీగా చేపట్టి,ఇంటి యజయానుల నుంచి మిషన్ భగీరథ నీటికి సంబంధించిన వివరాలను సంబంధిత అన్ లైన్ పోర్టల్ లో నమోదు చేయాలనీ సూచించారు.ఆ తర్వాత డంపింగ్ యార్డ్ ను సందర్శించి ప్రతి ఇంటినుండి తడి,పోడి, చెత్తలను వేరువేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వర్మి కంపోస్టు ఎరువుల తయారు పరిశీలించి సిబ్బందికి ఆయన పలు సూచనలు చేసారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ శ్రీదేవి, రైతులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులున్నారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి సమగ్ర అభివృద్ధి చెందేలా ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యతోపాటు క్రీడలలో సైతం విద్యార్థులు రాణించేలాచూడాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో సమావేశ మందిరంలో విద్యా సంవత్సరం ప్రారంభ మవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకోవాల్సిన చర్యలపై విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు,వ్యాయమ ఉపాధ్యాయులతో సమీక్షించారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళికబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. బడిబాట కార్యక్రమాన్ని విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సదుపాయాల గురించి వివరించాలని, ప్రతి ప్రభుత్వ పాఠశాలలో గతంలో కంటే కనీసం పది శాతం అదనంగా విద్యార్థుల ఎనరోల్మెంట్ పెరగాలని కలెక్టర్ సూచించారు. ప్రతి గ్రామంలో పాఠశాలల్లో చేరిన విద్యార్థుల జాబితా నుంచి ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రైవేటు పాఠశాలకు పంపడానికి గల కారణాలు తెలుసు కోవాలని, ఆ వివరాలతో ప్రత్యేకంగా నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. పాఠశాలలకు టీచర్స్, విద్యార్థుల హాజరు శాతంపై శ్రద్ధ వహించాలని కలెక్టర్ హెడ్ మాస్టర్ లకు సూచించారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని, ప్రతిరోజు పాఠశాలలో టీచర్స్ హాజరుపై నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారికి సూచించారు. పాఠశాలకు రెగ్యులర్ గా హాజరు కాని విద్యార్థులకు సంబంధించి జాబితా రూపొందించి వారు హాజరు కాకపోవడానికి గల సమస్యలు తెలుసుకొని, వీలైనంత వరకు పరిష్కరించి విద్యార్థుల హాజరు శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలలో వారానికి ఒక రోజు యోగ పీరియడ్ ఏర్పాటు చే యాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని, మధ్యాహ్న భోజన నాణ్యత అంశంలో ఎక్కడా ఎటువంటి రాజీ పడవద్దని అన్నారు. స్థలం అందుబాటులో ఉన్న పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేయాలని, పిల్లలకు మంచి పౌష్టికాహారం నాణ్యంగా, రుచిగా అందజేయాలని అన్నారు. పాఠశాలల్లో న్యూట్రి గార్డెన్, కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు వ్యవసాయ శాఖ నుంచి అవసరమైన విత్తనాలు సరఫరా చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ అధికారి డి.మాధవి, పాఠశాల అకాడమిక్ అధికారి పీఎం షేక్ తదితరులున్నారు.

## పాఠశాలల్లో ఆధునిక హంగులు



**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుల సదానందం ఆధ్వర్యంలో ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను బడికి పంపాలని కోరారు. ఈ సంధర్బంగా ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు ఉచిత బుక్కులు, పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం డిజిటల్ తరగతులు, ఎన్‌సిసి ఒకేషనల్ అధునాతన ట్యాబ్స్, కంప్యూటర్ బోధన లాంటి వసతులు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో శైలజ రవీందర్ రెడ్డి, సంతోష్, చంద్రశేఖర్, సమ్మయ్య, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌కు జోడించండి

**డిహెచ్‌పిఎస్ నాయకులవినతి**



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన దరఖాస్తులను రామగుండం కార్పొరేషన్ లో ఆన్లైన్ చేయక పోవడం వల్ల లబ్ధిదారులు కరెంట్ సబ్సిడీ మరియు గ్యాస్ సబ్సిడీ కోల్పోతున్నారని డి హెచ్ పి ఎస్ నాయకులు కందుకూరి రాజారత్నం, మద్దెల దినేష్‌గంగారపు ప్రసాద్ లు ఆరోపించారు. అనంతరం డిహెచ్పిఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దెల దినేష్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆరు గ్యారంటీ ల పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి నెలలో లబ్ధిదారుల నుండి పెద్ద ఎత్తున దరఖాస్తులు తీసుకుందని, కాని రామగుండం కార్పొరేషన్ లో దరఖాస్తులను సరిగా ఆన్లైన్ చేయకపోవడం వల్ల లబ్దిదారులు ప్రభుత్వ సబ్సిడిలను కోల్పోతున్నారని అయిన ఆరోపించారు. కార్పొరేషన్ నిర్లక్ష్యం వల్ల లబ్దిదారులు మళ్ళీ దరఖాస్తులు కార్పొరేషన్ కార్యాలయం కు వచ్చి అందజేయడం వల్ల జిరాక్స్ రవాణా ఖర్చులు భరిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లోక్ సభ ఎన్నికల కోడ్ రావడంతో మొత్తానికే అన్ లైన్ చేయడం నిలిపివేశారు.కోడ్ ముగియడంతో సవరణపై ఆశలు పెట్టుకుంటే ఇంతవరకు కూడా ఆన్లైన్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రారంభించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.జిల్లాలో పెద్దపల్లి, మంథని డివి జన్ల పరిధిలో మొత్తం 2,06,518 విద్యుత్తు కనెక్షన్లున్నాయి. శాసనసభ ఎన్నికల సమయంలో ఆరు గ్యారం టీల అమలు కోసం ప్రజాపాలనలో తెల్ల రేషన్ కార్డులున్న వినియోగదా రుల నుంచి గృహజ్యోతి పథకానికి దరఖాస్తులు స్వీకరించారు. కార్పొరేషన్ అవగాహన లోపంతో కొంత మంది దరఖాస్తు పత్రాలను ఆన్లైన్ చేయకపోవదంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దానితో రాయితీ పొందలేకపోతున్నారు.సవరించే క్రమంలో లోక్‌సభ ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా ప్రక్రియను నిలిపివేశారు. ఓట్ల లెక్కింపు పూర్తి కావడంతో కోడ్ ముగిసింది. దీంతో దరఖాస్తుల సవరణ ప్రక్రియను ప్రారంబించాలి రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్‌ని మంగళవారం కోరడం జరిగిందన్నారు.పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే ప్రారంభిస్తామని పత్రిక ప్రకటన ద్వార ప్రజలకు తెలియజేస్తామని కమిషనర్ తెలియజేసారన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ**

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, జూన్ 20న జిల్లాలో ఉన్న 119 సంవత్సరాల వయసు లోపు పిల్లలందరికీ నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతోసమీక్షించారు.స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ, నులి పురుగులు చాలా ప్రమాదకరమని, వీటితో రక్త హీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చునని అన్నారు.నులి పురుగుల నియంత్రణ చాలా కీలకమైన అంశమని, దీని పట్ల ఎవరూ నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వారికి కేటాయించిన విధులను సమన్వయంతో కట్టుదిట్టంగా నిర్వహించి 1 నుంచి 19 సంవత్సరాల వయస్సులో గల పిల్లలందరికీ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మందులు అందించాలని అన్నారు. జూన్ 20న జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో నులిపురుగుల నివారణ మందులను పంపిణీచేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని 706 అంగన్ వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలో, జూనియర్ కళాశాలలో జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 2,27,251 మంది 1 నుండి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలను పంపిణి చేయాలని అన్నారు. జిల్లాలో మొత్తం 2,49,976(10శాతంబఫర్ స్టాక్) మాత్రలనుఉంచుకున్నామని వివరించారు.

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

**యాసంగిలో 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరణ**

**పిఎసిఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**ప్రజాపక్షం/ మంథని:** యాసంగి సీజన్‌లో మంథని మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మంథనిలోని సంఘ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలులో మంథని పీఏసీఎస్ టాప్‌లో నిలిచి రికార్డు నెలకొల్పిందని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అత్యధికంగా వరి ధాన్యంకొనుగోలు కేంద్రాలు నిర్వహించి అత్యధిక స్థాయిలో 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించడం జరిగిందన్నారు. యాసంగి సీజన్‌లో మండల పరిదిలో 37 కొనుగోలుకేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో దాన్యం కొనుగోలు చేసినట్లు ఆయన వివరించారు. మండలంలోని సుమారు 4300మంది రైతుల నుంచి 3.70లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, సంఘం ద్వారా రూ.81.36కోట్ల వ్యాపారం జరిగినట్లు ఆయన తెలిపారు. రైతులు పండించిన పంటను అమ్ముకోవడంలో దళారులను ఆశ్రయించి నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో కంటే ఈసారి కొనుగోళ్లు సజావుగా సాగాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నష్టంజరుగకుండా పకడ్బందీగా పారదర్శకంగా కొనుగోళ్లు పూర్తి చేశామని ఆయన తెలిపారు. రైతులు, అధికారులు సహకరించారని తెలిపారు. ఈ సమావేశంలో సీఈఓ మామిడాల అశోక్, సంఘ సభ్యులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అపార ఉద్యోగ అవకాశాలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** జిల్లాలోని పద్మశాలి ఆఫీసియల్స్ అండ్ ప్రొఫషనల్స్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ర్యాంకర్లకు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజగోపాల్ మాట్లాడారు. పాలిటెక్నిక్ డిప్లొమా తో అద్భుత ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు.త్వరగా ఉద్యోగంలో స్థిరపడే అవకాశాలు పాలిటెక్నిక్ ద్వారా సాధ్యమవుతుందన్నారు.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE AT JAYA SHANKAR BHUPALPALLY
H.M.O.P.NO. 18 OF 2023
Between:-
Kyatharaju Mogili ...Petitioner
And
Kyatharaju @ Chandragiri Thirupa @ Vani ...Respondent
NOTICE
To,
Kyatharaju @ Chandragiri Thirupa @ Vani, W/o Kyatharaju Mogili, D/o Chandragiri Rajaiah, aged 33 years, Occu: Government Employee, O/o UPS School, Garla Village & Mandal, Mahabubabad Dist., R/o Mandalonipally, H/o Dubyala Village, Tekumatla Mandal, Jaya Shankar Bhupalpally Dist.,
...Respondent
Please take notice that the above O.P., filed by the petitioner against you for grant of divorce and the said case is posted on **21-06-2024** for your appearance. Therefore, you are hereby ordered to appear before the said Court on the above said date at **10-30 A.M.**, either in person or through an Advocate, failing which the matter will be decided exparte.
//By Order of the Court//
(BANDELA SWAMY)
Advocate-Parkal
Cell:9849778043

# నిర్మల్‌లో ఫర్టిలైజర్ డీలర్ల మాఫియా!




**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి:** రైతులు పంట పొలాలకు కొనుగోలు చేసే విత్తనాల దగ్గర కూడాప్రభుత్వంనిర్ణయించిన ధరకు అమ్ముకోలేక అధిక ధరకు అమ్మేందుకు ఫర్టిలైజర్ డీలర్లు కొరత సృష్టిస్తూ ఎంఆర్పి కంటే నాలుగు రేట్లు ధరకు రైతుకు అమ్ముకుంటూ మూడు పువ్వులు ఆరుకాయలుగా దోపిడీకి పాల్పడుతున్నారు.వ్యవసాయ అధికారుల అలసత్యం కారణంగా నిర్మల్ మార్కెట్లో ఈ దందా కొనసాగుతుంది.నిర్మల్ లో ప్రధానంగా ముగ్గరు డీలర్‌లు ఈ రకమైన కొత్త సృష్టిస్తూ నిర్మల్ అంతా హల్చల్ చేస్తారు. వాళ్లు నిర్ణయించిన ధరకే రైతులు,సబ్ డీలర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీనిపై అధికారులకు సమాచారం ఇచ్చినా కనీసం స్పందిచకపోవడం వారిపై చర్యలు తీసుకోకపోవడం ఇది అధికారుల అలసత్వమే కదా...?ప్రతి నెల వచ్చే మామూళ్లకు ఆశపడి డీలర్ల పై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం వాళ్ళు చెప్పిందే వినాల్సిన అవసరం..ఏదైనా పై అధికారులకు అనుమానాలు వచ్చి ఫర్టిలైజర్ లను తనిఖీ చేయాలన్నా,కూడా ముందస్తు సమాచారం ఇచ్చి ఎవరి దగ్గరికి తీసుకువెళ్లలో అధికారులే నిర్ణయిస్తారు. ఇదో మాఫియా లాగా నిర్మల్ లో తయారయింది.జిల్లా వ్యవసాయ అధికారి పై ఎన్నో విమర్శలు వచ్చిన తన పలుకుబడి కారణంగా ఎప్పుడు కూడా అధికారులు తన వైపు ఏలెల్తి చూపరు. ఎందుకో మరి ఇటు రైతులంటే అంతే ఈనంగా చూస్తూ డీలర్లను బతికిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్న జిల్లా కలెక్టర్‌స్పందించకపోవడం కూడా ఓ ఆలోచన చేయాల్సిన అవసరం. స్థానిక జిల్లా కలెక్టరుకు తెలుగు భాషపై పట్టు లేక అధికారులు చెప్పిందే తల ఊపి తన పని తాను చేసుకోపోతుంటే ఇక అసలు సమస్య ఇక్కడే ములుగుతుంది.జిల్లా కలెక్టర్ హిందీ తప్ప ఇంగ్లీష్ తప్ప తెలుగుపై అంతా అవగాహన లేదు.ప్రతికలలో ఎన్నో కథనాలు వచ్చినా స్థానిక అధికారులు వివరించి చెప్పరు.ఎక్కదికక్కడే మేనేజ్ చేసుకుంటూ సమస్యను మరింత జటిలం చేస్తూ వచ్చారు.ఇది జిల్లా అధికారుల పనితీరు రైతుల సమస్యలు ఎలా పరిష్కరిస్తారో...?అంటే వ్యవసాయాధికారులు ఆడింది ఆటే పాడింది పాటే పై నుంచి ఎనోట్న ఒత్తిళ్లు అయినా లైట్ గా తీసుకుంటారు.జిల్లా కలెక్టర్ ఎన్ని సమీక్షలు పెట్టిన సమస్య మాత్రం పరిష్కారం కాదు.అధికారులు తలుచుకుంటే క్షణాలలో ఫర్టిలైజర్ల షాపులను సీజ్ చేయొచ్చు..వాటిని సీజ్ చేస్తే తమకు వచ్చే వాటా రాదేమో అనుకోని కనీసం అటువైపు చూడరు.ఇది జిల్లాలో వ్యవసాయ అధికారుల పనితీరు.జిల్లా మీద పట్టు సాధించాలంటే స్థానిక జిల్లా కలెక్టర్ కు తెలుగు పూర్తిగా నేర్చుకుని ఉండాల్సిందే లేదంటే అధికారులు ఆడింది ఆట పాడిందే పాట..ఇది నిర్మల్ జిల్లాలో ఉన్న తాధికారుల ధీమా..!! వ్యవసాయ అధికారులు సమస్య పరిష్కరిస్తారా..కలెక్టర్ దృష్టి సారిస్తారా చూడాలి.

## తెలంగాణ మంత్రులకు కొత్త వాహనాలు..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పలువురు మంత్రులకు కొత్త వాహనాలను అందించింది. పాత వాహనాల స్థానంలో టయోటా ల్యాండ్ క్రూయిజర్ వాహనాలను అందజేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో సిఎం కాన్వాయ్ కోసం కొత్త వాహనాల కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ వాహనాలను సిఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ కోసం ఉపయోగిస్తున్నారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దిన ఈ వాహనాలను మంత్రులకు కేటాయింపులు చేశారు. మరికొంత మంది మంత్రులు బుధవారం వాహనాలను అందుకోనున్నారు.

## ఓయు విద్యార్థుల పిటిషన్ డిస్మిస్

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలో నీరు, విద్యుత్ కొరతల పేరుతో వేసవి సెలవులు ఇచ్చారనే సందర్భంగా వెలువడిన సర్క్యులరు వివాదంపై దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. నీరు, విద్యుత్ కొరత కారణంగా సెలవులు ప్రకటించిన వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డి ట్వీట్ చేశారంటూ విద్యార్థులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును నమోదు చేయలేదని హైకోర్టులో పిటిషన్ వేశారు. దీనిని కొట్టేస్తూ జస్టిస్ విజయసేన్‌రెడ్డి మంగళవారం తీర్పు చెప్పారు. మే మొదటివారంలో రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. గత ఏడాది వేసవి సెలవుల సర్క్యులర్‌ను సిఎం ట్వీట్ చేశారని, అప్పుడు నీరు, విద్యుత్ కొరత లేదని, తప్పుడు సర్క్యులర్‌ను ట్వీట్‌లో పేర్కొన్నారని పిటిషనర్ల వాదన. సీఎం ట్వీట్‌లోని సర్క్యులర్ నిజమైనదని ప్రభుత్వ వాదన. వాదనల తర్వాత అధికారుల ఫిర్యాదుపై పోలీసుల దర్యాప్తులో నిజానిజాలు తేలుతాయని, పిటిషన్‌ను కొట్టివేస్తున్నామని న్యాయమూర్తి చెప్పారు.

# మ్యాన్‌హోళ్లు తెరిస్తే కఠినచర్యలు

నిబంధనల ఉల్లంఘనలకు కేసులు
మ్యాన్‌హోళ్లకు సేఫ్టీ గ్రిల్స్
అందుబాటులో ఎయిర్‌టెక్ మిషన్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలోని రహదారులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న మ్యాన్‌హోళ్లు తెరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాయని జలమండలి అధికారులు హెచ్చరించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ సూచనలు చేశారు. వర్షాకాల ప్రణాళికలో భాగంగా ఇప్పటికే అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. లోతైన మ్యాన్ హోళ్లతో పాటు 25 వేలకు పైగా మ్యాన్ హోళ్లపై ఇప్పటికే సేఫ్టీ గ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్ తో సీల్ చేసి, రెడ్ పెయింట్ ఏర్పాటు చేశారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్‌టి), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్‌పిటి) వాహనాలను రంగంలోకి దింపారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలు అందించారు. ఈ బృందాలకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్ తో కూడిన డీ వాటర్ మోటార్ ఉంటుంది. దీని సాయంతో వర్షపు నీటిని తొలగిస్తారు. వీరంతా ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పనిచేస్తారు. అధికంగా నీరు నిలిచే ప్రాంతాలపై ఈ బృందాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయి. వీటితో పాటు ఎయిర్ టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉన్నాయి. మ్యాన్ హోళ్ల నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్)ని ఎప్పటికప్పుడు తొలగిస్తారని అధికారులు వివరించారు.





**సెక్షన్ కు ఒక బృందం ఏర్పాటు...** మ్యాన్ హోళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందం ఏర్పాటు చేశారు. వీరు ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జిహెచ్‌ఎంసి అధికారుల సమన్వయంతో ఎప్పటి కప్పుడు క్లియర్ చేస్తారు. ఎక్కడైనా మ్యాన్ హోల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా లేదా ఇతర సమస్యలు, ఫిర్యాదులుంటే జలమండలి కస్టమర్ కేర్ నెంబరు 155313కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి. దగ్గర్లోని జలమండలి కార్యాలయాల్లో నేరుగా సంప్రదించవచ్చు.

**చట్టం ఏం చెబుతోంది...** ఎవరైనా పౌరులు, అనధికార వ్యక్తులు అధికారుల అనుమతి లేకుండా మ్యాన్ హోళ్లపై ఉన్న మూత తెరచినా, తొలగించినా హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎస్‌బి యాక్ట్ 1989, సెక్షన్ 74 ప్రకారం నేరం. దీన్ని అతిక్రమించి, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటారు. అలాంటి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. నిందితులకు జరిమానా విధించడంతో పాటు కొన్నిసార్లు జైలుశిక్ష కూడా వేసే అవకాశముంది.

**కార్మికులకు శిక్షణ...** పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది విధులు నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో ఎలా పనిచేయాలనే విషయంపై వారికి జలమండలి ఏటా భద్రతా వారోత్సవాలు, పక్షోత్సవాలు నిర్వహిస్తోంది. ఈకార్యక్రమాల్లో వారికి ఎస్ ఓపి మార్గదర్శకాల ప్రకారం, భద్రతా పరికరాల పని తీరు, ఉపయోగించే విధానం, పారిశుద్ధ్య పనుల్లో తీసుకోవాల్సిన అన్నిజాగ్రత్తలపై శిక్షణ ఇస్తోంది. అంతే కాకుండా పని ప్రదేశాల్లో ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు చేసే ప్రథమ చికిత్సపైనా అవగాహన కల్పిస్తుంది.

**మాధ్యమాల్లో విస్తృత ప్రచారం...** వర్షాకాలంలో సీవరేజి నిర్వహణలో సాధారణ పౌరులు ఎలా ప్రవర్తించాలి, ఎలా నడుచుకోవాలనే అంశాలపై జలమండలి విరివిగా ప్రచారం చేస్తుంది. స్థానిక కాలనీల సంఘాలు, ఎస్‌హెచ్ గ్రూపుల సభ్యులతో ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. అంతే కాకుండా చేయాల్సిన, చేయకూడని పనులపై దిన పత్రికలు, టెలివిజన్, ట్విటర్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని అధికారులు చెప్పారు.

## సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాలన్న సిఎం ఆలోచనను స్వాగతిస్తున్నాం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో సెమీ రెసిడెన్షియల్ స్కూళ్లు పెట్టాలన్న సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలను స్వాగతిస్తున్నామని ఎంపి మల్లురవి పేర్కొన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్ళలో సరైన సౌకర్యాలు లేవని, సెమీ రెసిడెన్షియల్ స్కూళ్ల ద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు. టీచర్లు లేరనీ గత ప్రభుత్వం పాఠశాలలను మూసేసిందన్నారు. మూసేసిన పాఠశాలలను మళ్ళీ తెరుస్థాం అన్నారు. ఏకోపాధ్యాయ స్కూళ్లను రద్దు చేయరని సిఎం హామి ఇవ్వడం శుభపరిణామమన్నారు. 2 వేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాంమన్నారు. ప్రతి పాఠశాలలో టాయిలెట్లు , ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అన్ని సౌకర్యాలను కల్పించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల శాతాన్ని పెంచుతాంమని ధీమా వ్యక్త పరిచారు. బయ్యారం స్టీల్ ప్లాంట్, ఖాజీ పేట కోచ్ ఫ్యాక్టరీ, రంగారెడ్డి పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదా సమస్యల మీద పార్లమెంట్ లో కొట్లాడతామన్నారు. విభజన సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్ లో కేంద్రాన్ని నిలదీస్తామన్నారు. బడి బాట కార్యక్రమంలో ప్రజా ప్రతినిదులు పాల్గొనాలని సిఎం రేవంత్ సూచించారని తెలిపారు.

## వరద ప్రభావం నుంచి కాలనీలకు ఉపశమనం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** వర్షపు నీరు కాలనీలపై ప్రభావం లేకుండా ఉపశమనం కల్పించామని ఎల్‌బి నగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనస్థలిపురం డివిజన్‌లోని క్రిస్టియల్ కాలనీలో పర్యాటించి, వర్షపు నీరు పైప్‌లైన్ పనులు పూర్తి చేయగా, పైప్‌లైన్ పనుల ద్వారా రోడ్డు డ్యామేజ్ కావడంతో వాటిని మరమత్తులు చేయాలని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వర్షపు నీరు కాలనీల్లో చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయంలో గతంలో నిధులు మంజూరు చేయడంతో పనులు పూర్తి చేయడంతో, సీసీ రోడ్డు మరమత్తులు చేయాలని అధికారులకు సుధీర్‌రెడ్డి సూచించారు. కాలనీ ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జిహెచ్‌ఎంసి అధికారులు రఫీ, ప్రజ్ఞ పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు మంజూరు

జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి



**ప్రజాపక్షం/వనస్థలిపురం:** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎల్‌బి నగర్ జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్ పంకజను బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మంగళవారం కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లో పలు కాలనీలకు సంక్షేమ సంఘం భవనాలు, వీధీ దీపాలు, పార్కుల అభివృద్ధికి నిధులు అందించాలని కోరారు. డివిజన్‌ను అన్ని విధాలు అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. అభివృద్ధి పనులకు కాలనీ వాసులు సహకారం ఉండాలన్నారు.

## ఎర్రకుంట చెరువు పనుల పరిశీలన



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్ ఎర్రకుంట చెరువు పూడిక పనులను మంగళవారం కమిషనర్ బి.శరత్ చంద్ర, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూపది రోజులుగా నిరంతరం జరుగుతున్న ఎర్రకుంట చెరువు పూడిక పూర్తయితే ఈఏడాది చెరువు నిండితే ఈపరిసర ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉండదన్నారు. పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంచి సదుద్దేశంతో చేపట్టిన పూడికతీత కార్యక్రమాన్ని గ్రామస్తులు, కాలనీవాసులు అభినందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డి.యాదయ్య, వర్క్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు టింకురెడ్డి, సంతోష్ ముదిరాజ్,లక్ష్మి నగర్ కాలనీ అధ్యక్షులు రవికాంత్‌రెడ్డి, బాగ్యనగర్ కాలనీ అధ్యక్షులు పిసిజీ చారీ, కార్యదర్శి సురేందర్, కాంట్రాక్టర్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/యాచారం :** మేడిపల్లి గ్రామాభివృద్ధికి తమ పౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని ఎవిజి ఫౌండేషన్ చైర్ పర్సన్ అడాల వరలక్ష్మి గణేశ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలోని అంగన్ వాడి కేంద్రాలకు 30 కుర్చీలను అందజేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ తమ ఫౌండేషన్ అధ్వర్యంలో గ్రామంలో అనేక సేవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల సహకార సంఘం డైరెక్టర్ మక్కపల్లి స్వరూప శ్రీనివాస్, మాజీ సర్పంచ్ బొడ కృష్ణ, మాజీ వార్డుమెంబర్లు సురేంధర్‌రెడ్డి, కొంగళ్ళ కృష్ణ, అంగన్ వాడి టిచర్లు రాజ్యలక్ష్మి , విజయలక్ష్మి , యం. శివకుమార్, ఎర్పుల శేఖర్, జావిద్, జలీల్, రవూఫ్, జగన్, నర్సింహ్మా పాల్గొన్నారు.

## త్వరతగతిన సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి, గచ్చిబౌలి డివిజన్ పరిధిలో సమస్యలు, చేపట్టవలిసిన అభివృద్ధి పనులపై శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలసి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తాండ, గోపన్‌పల్లి, రాజీవ్‌నగర్‌లలో పర్యటించారు. బస్తీలలో చేపట్టవలసిన సిసిరోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులు, వాటర్‌పైప్‌లైన్ పనుల ఏర్పాటుకు ప్రణాళికలను రూపొందించాలని జోనల్ కమీషనర్‌కు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ విన్నవించారు. అసంపూర్తిగా మిగిలిన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జోనల్ కమిషనర్ అధికారులను అదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యుఎస్ డిజిఎం శరత్‌కుమార్, హెచ్‌ఎండబ్ల్యు ఎస్ మేనేజర్ అభిషేక్ రెడ్డి,ఈఈ శ్రీనివాస్, డిఈ విశాలక్షి, టౌన్ ప్లానింగ్ అధికారులు రమేష్, రవిందర్‌రావు, ఏఎంఓహెచ్ నగేష్ నాయక్, హనుమంతు నాయక్, నాయకులు రాజు, రమేష్, నర్సింగ్ నాయక్, ప్రసాద్, మహేష్, గోవర్ధన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఓఆర్‌ఆర్ వరకు డిఆర్‌ఎఫ్ సేవలు విస్తరణ

అదనంగా మరో 15 డిఆర్‌ఎఫ్ బృందాల ఏర్పాటు
భారీవర్షాలు, విపత్తుల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారీ వర్షాలు, ఇతర విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని పౌరులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు హైదరాబాద్ ఓఆర్‌ఆర్ పరిది వరకు జిహెచ్‌ఎంసి డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలను విస్తరించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలియచేశారు. హైదరాబాద్ నగరంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు ఆకస్మిక వర్షాలు, వరదలు వచ్చినా ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు రాకుండా తగిన వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఇటీవల ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిహెచ్‌ఎంసి ఇంచార్జ్ కమిషనర్ ఆమ్రపాలి, జిహెచ్‌ఎంసి ఈవిడిఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ శాంతికుమారి మాట్లాడుతూ, జిహెచ్ ఎంసిలోని డిజాస్టర్ రెస్పాన్స్ విభాగాన్ని మరింత పటిష్ట పరుస్తున్నామని, ఇందుకుగాను విపత్తులను ఎదుర్కోవడానికి అదనపు సిబ్బందిని, తగిన యంత్ర పరికరాలను అందచేయనున్నామని వివరించారు. ఇప్పటికే, జిహెచ్‌ఎంసి పరిధిలో 30 డిఆర్‌ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని, వీటికి తోడు మరో 15 బృందాలను అదనంగా ఏర్పాటు చేసి వీటి సేవలను ఓఆర్‌ఆర్ వరకు విస్తరించనున్నట్టు వెల్లడించారు. హైదరాబాద్ పరిధిలో పెద్ద సంఖ్యలో ఫార్మా కంపెనీలు ఉన్నందున, కెమికల్ ఫైర్ ప్రివెన్షన్‌కు ప్రత్యేక శిక్షణతో కూడిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని అధికారులకు శాంతికుమారి సూచించారు. హైదరాబాద్ నగరంలో 141 సమస్యాత్మక ప్రాంతాలలో మున్సిపల్, పోలీస్, విద్యుత్, జలమండలి తదితర సంబంధిత శాఖల సమన్వయంతో పౌరులకు ఏవిధమైన ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలని సిఎస్ పేర్కొన్నారు. హైదరాబాద్ తోపాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర నగరాలలో కూడా డిఆర్‌ఎఫ్ బృందాలను ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న డిఆర్‌ఎఫ్ బృందాలను పటిష్టపర్చడం చేయాలని ఆదేశించారు. విపత్తులు వచ్చినప్పుడు ఎన్‌డిఆర్‌ఎఫ్ విభాగంతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దేశంలోని ప్రధాన మహానగరాలైన ముంబయి, ఢిల్లీ, చెన్నై, బెంగుళూరులలో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాల పనితీరుపైకూడా అధ్యయనం చేయాలని అధికారులను సిఎస్ ఆదేశించారు.

## నకిలీ విత్తనాలు, ఎరువులపై ఉక్కుపాదం

ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నకిలీ విత్తనాలు, ఎరువులపై పోలీస్ అధికారులు ఉక్కుపాదం మోపాలని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ కోరారు. మంగళవారం పట్టణంలోని ఎల్‌ఎన్ గార్డెన్‌లో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డీలర్లుకు ఎరువుల కల్తీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. శంషాబాద్ డిసిపి నారాయణరెడ్డితో పాటు ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ శంకర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు ఎక్కడ విక్రయించినా వారిపై పిడి యాక్ట్ కేసులు నమోదు చేయడం తోపాటు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమిష్టిగా పనిచేసి నకిలీ విత్తనాలు, ఎరువులును నియంత్రించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. డీలర్లు మానవత్వంతో అన్నదాతలకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అంధించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఇచ్చే విత్తనాలకు సంబంధించిన పేర్లతోపాటు బ్యాచ్ నంబర్లు రిజిస్టర్‌లో భద్ర పరిస్తే భవిష్యత్‌లో ఉపయోగపడే అవకాశాలు ఉంటాయని శంషాబాద్ డిసిపి నారాయణ రెడ్డి అన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలకు పూర్తి స్థాయిలో అదుకునేందుకు ప్రతి ఒక్కరు నడుం బిగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ప్రభుత్వాన్ని, సమాజాన్ని కాపాడేందుకు అధికారులు ఉన్నారని, డీలర్లు మంచిరకం విత్తనాలను అన్నదాతలకు ఇచ్చేందుకు కృషి చేయాలని సూచించారు. అన్నం పెట్టే అన్నదాతలను మోసం చేస్తే వారిపై ఫిడియాక్ట్ కేసులతోపాటు కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఏసిపి రంగస్వామి, ఏడిఎ రాజారత్నం, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వై.యాదయ్యయాదవ్, వ్యవసాయ అధికారులు నిశాంత్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి తేజ్ కుమార్, ప్రియాంకతోపాటు డీలర్లు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించేందుకు కృషి



**ప్రజాపక్షం/షాబాద్ :** విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మండల అభివృద్ధి అధికారిణి అపర్ణ అన్నారు. మంగళవారం షాబాద్ మండల డ్వాక్రా సంఘం భవనంలో షాబాద్ మండల ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధించిన ఏకరూప దుస్తులు మండల విద్యా అధికారి శంకర్ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా అపర్ణ మాట్లాడుతూ.. ప్రైయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించి విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యను అందించేందుకు తచర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ తరుపున మండలంలోని ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యార్థులకు మంచి విద్యను అందించేవిధంగా కృషి చేస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే కీర్తి ప్రతిష్ఠలు వస్తాయని చెప్పారు. మండల విద్యా అధికారి శంకర్ మాట్లాడుతూ.. మండలంలోని విద్యార్థులకు మొదట విడుతగా బాలురకు 1,818 మంది, బాలికలకు 20,50 మందికి వచ్చినట్లు తెలిపారు. మిగితావి రెండవ విడుతలో అందరికి అందే విధంగా చూస్తామన్నారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించే విధంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఎం నర్సింలు, లక్ష్మణ్, ఉపాధ్యాయులు హన్మంతు, ప్రశాంత్, స్వప్న, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా పనిచేస్తే సమస్యలు పరిష్కారం

తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట:** ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రణాళికబద్ధంగా పనిచేస్తే అన్నదాతల సమస్యలు పరిష్కారమవుతాయని కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం జడ్పి సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా విశాల శ్రావణ్‌రెడ్డి మాట్లాడుతూ మైనింగ్ లైసెన్స్‌లు పొందిన యాజమానులు రూల్స్ పాటించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మధ్య కాలంలోనే ఓ యువకుడు మైనింగ్ తీసిన గుంతలో పడి మరణించడం జరిగిందని గుర్తు చేశారు. కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు సమయ పాలన పాటించడం లేదని, దాంతో రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. ఆర్‌టిసి బస్సుల కొరత అనేకంగా ఉందని, వీటిని తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలలు పున:ప్రారంభం అవుతున్నాయని, ప్రతి పల్లెకు ఆర్‌టిసి బస్సును నడిపించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని పరిసరాలు పరిశుభ్రం గా ఉండే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కాలం చెల్లిన విద్యుత్ వైర్ల స్థానంలో కొత్త వైర్లు ఏర్పాటు చేయడంతోపాటు స్థంబాలను సైతం భిగించేందుకు కృషి చేయాలని విశాల కోరారు.

# జిల్లాలో డిప్యూటేషన్లు రద్దుచేయాలి

రంగారెడ్డి జెడ్‌పి సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
అది శాఖపరమైన నిర్ణయం
కలెక్టర్ శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖతో పాటు విద్యాశాఖ పరిధిలో డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా పరిషత్ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జడ్‌పి చైర్‌పర్సన్ డాక్టర్ తీగల అనితా హరినాథ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి కలెక్టర్ కె.శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్‌పర్సన్ అనితా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ సర్వసభ్య సమావేశం చివరిదని, ఐదు సంవత్సరాలు సహకరించిన జిల్లా ప్రాదేశిక సభ్యులు, ఎంపిపిలు, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షిస్తూ జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో డాక్టర్లు, సంబంధిత సిబ్బంది లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి ఆసుపత్రిలో కావలసిన సదుపాయాలు ఉండేలా చూడాలని అని సభ్యులు అధికారులను కోరారు. డాక్టర్లు లేక ఇబ్బంది పడుతున్నారని కొంతమంది సభ్యులు తెలిపితే, మరికొన్ని పిహెచ్‌సి, సిహెచ్‌సి సెంటర్లలో డాక్టర్లు ఉన్న సరి గా డ్యూటీలకు రావడం లేదని, కొంతమంది డాక్టర్లు ప్రైవేటు ప్రాక్టీస్‌కి అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, మారుమూల ప్రాంతాల్లో ఉన్న డాక్టర్లు వివిధ సాకులు చూపి పట్టణ ప్రాంతాలకు డిప్యూటేషన్లు వేయించుకున్నారని ఇంకొంతమంది సభ్యులు వాపోయారు, మారుమూల ప్రాంత పాఠశాలల్లో ఉపాధ్యాయులు, డాక్టర్ల పట్టణ ప్రాంతాలకు అందుబాటులో ఉండే విధంగా డిప్యూటేషన్లలో వెళ్లి పనిచేస్తున్నారని మెజార్టీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ డాక్టర్ అనిత హరినాద్‌రెడ్డి ఆయాశాఖల్లో డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరుతూ జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డికి సిఫార్సు చేశారు. దీంతో సభ్యులందరూ అంగీకారం తెలిపారు. కలెక్టర్ కె.శశాంక స్పందిస్తూ డిప్యూటేషన్‌లు శాఖ పరమైన నిర్ణయమని తెలిపారు. డిప్యూటేషన్లు మెడికల్ రీజన్స్‌తో కొన్ని, వర్క్ అడ్జస్ట్ మెంట్‌తో మరికొన్ని చేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ల నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ ఇస్తున్నప్పటికీ చేరడం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ద్యాశాఖపై సమీక్షిస్తూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని, మంచినీటి సౌకర్యం పరిష్కరించి, స్వావెంజర్‌లను నియమించాలని సభ్యులు కోరారు. వ్యవసాయశాఖపై సమీక్షిస్తూ రైతులకు నకిలీ విత్తనాలు ఎరువులతో ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించాలని, నిరుపయోగంగా ఉన్న రైతువేదికల్లో మేలురకమైన విత్తనాలు విక్రయించేందుకు ఉపయోగిస్తే బాగుంటుందని, మూసి పరివాహక ప్రాంత రైతులు మిల్లర్ల వద్ద ధాన్యం అమ్ముకునే విషయంలో తరుగు పేరుతో తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నారని అబ్దుల్లాపూర్మెట్ జెడ్పిటిసి బింగి దేవదాస్ గౌడ్ వాపోయారు. విద్యుత్ శాఖ పై సమీక్షలో భాగంగా గాలివానలకు విద్యుత్ పోవడం జరుగుతుందని, సంబంధిత ఎఇలు, లైన్ మెన్లు స్పందించడం లేదని, పాత స్తంభాలు తొలగించాలని, కిందకు వేళ్ళాడుతున్న వైర్లను సరి చేయాలి అని, రానున్నది వర్షాకాలంలో జిల్లాలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను సభ్యులు కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఈటా గణేష్,జిల్లా ప్రజా పరిషత్ సిఇఒ కృష్ణరెడ్డి, డిప్యూటీ సిఇఒ రంగారావు, కోఆప్షన్ సభ్యులు, జెడ్‌పిటిసిలు ఎంపిపిలు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

